## పెయ్యేరు సర్పంచి చెక్ పవర్ రద్దు

### ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అశోక్‌కు బాధ్యతలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని పెయ్యేరు గ్రామ సర్పంచి అల్లు సుశీల చెక్ పవర్‌ను రద్దు చేస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ పంచాయతీలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు పలుసార్లు జిల్లాస్థాయి అధికారులు గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఈ పంచాయతీకి సంబంధించి కేసులు కోర్టులో నడుస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సర్పంచి అల్లు సుశీల చెక్ పవర్‌ను ఆరు నెలల పాటు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ సర్పంచికి అందించారు. అప్పటివరకు బాధ్యతను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అశోక్ నిర్వహించాలంటూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

# టిడ్కో.. ఇచ్చేదెన్నటికో..!

టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఆర్భాటంగా ప్రారంభించింది. అయితే ప్రారంభం ఘనంగా ఉన్నా అమలు మాత్రం ముందుకు సాగని పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భవనాలు పూర్తికపోవడంతో పేదలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నారు. ఇప్పటికే గృహ ప్రవేశాలు చేసిన వారు సరైన మౌలిక వసతులు లేక అవస్థలు పడుతుంటే.. గృహ ప్రవేశాలు చేయని వారు వాటి కోసం ఎదురుచూస్తున్నారు..

- రెండు జిల్లాల్లో పలుచోట్ల ఇంకా పూర్తికాని గృహాలు
- అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పేదలు
- గృహ ప్రవేశాలు చేసిన చోట మౌలిక వసతుల కొరత
- పిచ్చిమొక్కలతో ఆ ప్రాంతం అధ్వానం
- లబ్ధిదారుల ఆవేదన

తాడేపల్లిగూడెంలో ఇలా..

జంగారెడ్డిగూడెం : అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు, పెరిగిన పిచ్చిమొక్కలు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

తాడేపల్లిగూడెం శివారు ప్రాంతమైన ఎల్.అగ్రహారంలో 5,376 టిడ్కో గృహాలు మంజూరు కాగా వాటిలో 3,232 మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అవి పూర్తికాని పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే గృహ ప్రవేశాలు చేసిన వారు సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మురుగు నీరు బయటకు పోయేందుకు వీల్లేక చెత్తా చెదారంతో నిండిపోయిందని, మొదటి అంతస్తులో నీరు కిందకు వెళ్లక అనేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోయారు. గతంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, జెసిబి సాయంతో డ్రెయినేజీ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారని తెలిపారు. అయితే తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే గృహాల చుట్టూ చెట్లు, పొదలు గుబురుగా మొలవడంతో పాములు సంచరిస్తున్నాయని, ఇటీవల పాము ఓ మేకను కాటేయడంతో మృతి చెందిందని తెలిపారు. ఈ ప్రాంతంలోనే చిన్నపిల్లలు ఆడుకుంటారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉందని వాపోతున్నారు. గతంలో ఇక్కడ పార్క్ నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చారని, అది నిర్మిస్తే కొంత వరకూ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కోరుతున్నారు. చెత్త తీసుకెళ్లడానికి పారిశుధ్య వాహనం వారానికి ఒకసారి వస్తుందని, అప్పటివరకు చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత అధికారులు, నాయకులు సమస్యలను పరిష్కరించాలని టిడ్కో గృహవాసులు కోరుతున్నారు.


పాలకొల్లు : టిడ్కో ఇళ్ల వద్ద మురుగునీరు ఇలా

నూజివీడు టౌన్ : టిడ్కో ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

**టిడ్కో ఇళ్ల వద్ద సమస్యలు తిష్ట..** ★★★

**పాలకొల్లు :** పాలకొల్లులో టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచీ రాజకీయ పరిణామాల మధ్య ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద లక్ష జనాభా దాటిన పట్టణాలకే ఈ స్కీమ్ అమల్లో ఉండగా 2017లో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి పాలకొల్లులో టిడ్కో గృహాల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. అయితే 2019 ఎన్నికల ముందు వరకూ 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నికల ముందు 2 వేల మంది టిడిపి లబ్ధిదారులచే గృహ ప్రవేశం చేయించారు. తరువాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టా రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. 2022లో మొదటి విడతగా 1,856 ఇళ్లు, 2024లో మరో 704 ఇళు లబ్ధిదారులకు ఇచ్చింది. తర్వాత వైసిపి ప్రభుత్వం వచ్చాక అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయని పరిస్థితి అని టిడిపి ఆరోపించింది.

అయితే ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గృహాల వద్ద కనీస వసతుల కల్పనకు కషి చేస్తోంది. మంత్రి నిమ్మల రామానాయుడు విద్యుత్ స్తంభాలు వేయించారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లు పంపిస్తున్నాఉ. మురుగు పోయేలా కృషి చేస్తున్నారు. ప్రజలు కాలువ అవతలకు వెళ్లేందుకు రూ.రెండు కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇంకా 1500 గృహాలు లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 6,144 గృహాలకు కేవలం 2,560 గహాలు ఇచ్చారని మిగిలినవి ఇవ్వాలని లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారు. కొంతమంది తాము ఇంకా ఇళ్లల్లోకి రాకపోయినా బ్యాంకులకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఖాళీగా ఉన్న గృహాల వద్ద పేకాట, మద్యం తాగడం వంటివి అసాంఘిక కార్యకలాపాలకు యువత పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాల వద్ద పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు దూరం వెళ్లాల్సి వస్తోందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పట్టణం నుంచి గృహాల వద్దకు మంత్రి ఉచిత వ్యాన్ నడుపుతున్నారు. మిగిలిన ఇళ్లను అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**భవనాలకు మోక్షం ఎప్పుడు..!.** ★★★

**జంగారెడ్డిగూడెం :** టిడ్కో ఇళ్లు తమకు ఎప్పుడు పూర్తిచేసి అందిస్తారని లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు మాత్రం అప్పగించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని మార్కండేయపురం దగ్గరలో 2014లో పేదల కోసం టిడ్కో గృహ నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి ఆ భవనాల పరిస్థితి అలాగే ఉంది. భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వంలోనూ వాటిని పట్టించుకోని పరిస్థితి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా భవనాలకు మోక్షం లభిస్తుందా, పేదలకు అందిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి ఇళ్లు లేని నిరుపేదలకు అందించాలని అధికారులను, ప్రభుత్వాన్ని ప్రజలు వేడుకుంటున్నారు.

**ఏడేళ్లయినా ఊసే లేదు..** ★★★

**నూజివీడు టౌన్ :** నూజివీడు పట్టణ పరిధిలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ఆర్భాటంగా జి ప్లస్ త్రీ విధానంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆనాటి పాలన ముగింపు దశలో ఈ నిర్మాణాలు ప్రారంభించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సిఎంగా అధికారం చేపట్టిన తర్వాత ఒక్క గుడివాడ తప్ప ఎక్కడా టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. నూజివీడు పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది.

నూజివీడు పట్టణ పరిధిలో డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో టిడ్కో గృహ నిర్మాణాలు జిప్లస్‌త్రి విధానంలో చేపట్టారు. ఈ నిర్మాణాల్లో 300 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 430 ఎస్ ఎఫ్‌టిలో 912 మంది మొత్తం 2640 మందికి గృహాలు మంజూరయ్యాయి. 300 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 849 మంది రూ.500 చొప్పున, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 517 మంది రూ.50 వేలు చొప్పున, 430 ఎస్ఎఫ్‌టి కేటగిరీలో 897 మంది రూ.లక్ష చొప్పున మొత్తం 6.91,74,278 డిపాజిట్లుగా లబ్ధిదారులు చెల్లించారు. లబ్ధిదారులు డిపాజిట్ చెల్లించి ఈ ఏడాదికి ఏడేళ్లు నిండాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల ఊసే లేదంటే అర్థం చేసుకోవచ్చు.

# 1న పింఛన్ల పంపిణీకి సర్వసన్నద్ధం

### 4,358 కొత్త స్పౌజ్ పెన్షన్లు పంపిణీ

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ప్రజాశక్తి - ఏలూరు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.114.25 కోట్లు ఆగస్టులో 2,61,592 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆగస్టు నెల పింఛన్ల చెల్లింపులపై బుధవారం సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అనివార్య కారణాల రీత్యా ఒకటో తేదీన తీసుకోని వారికి రెండో తేదీన పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 5,303 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ముందస్తు సమాచారం అందించాలన్నారు.

**4,358 కొత్త స్పౌజ్ పెన్షన్లు పంపిణీ**

జిల్లాలో ఆగస్టు నెలలో స్పౌజ్ కేటగిరి (వితంతు పింఛన్లు) కొత్తగా 4,358 ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. వాటిని ఆగస్టు నెలలో పింఛనుదారులకు పంపిణీ చేస్తామన్నారు. ఆగిరిపల్లి మండలంలో 200 మంది, భీమడోలు 152, బుట్టాయిగూడెం 107, చాట్రాయి 170, చింతలపూడి 160, చింతలపూడి అర్బన్ 39, దెందులూరు 151, ద్వారకాతిరుమల 161, ఏలూరు 87, ఏలూరు అర్బన్ 404, జంగారెడ్డిగూడెం 133, జంగారెడ్డిగూడెం అర్బన్ 80, జీలుగుమిల్లి 55, కైకలూరు 161, కలిదిండి 154, కామవరపుకోట 130, కొయ్యలగూడెం 180, కుక్కునూరు 86, లింగపాలెం 132, మండవల్లి 118, ముదినేపల్లి 148, ముసునూరు 136, నిడమర్రు 97, నూజివీడు 200, నూజివీడు అర్బన్ 88, పెదపాడు 147, పెదవేగి 194, పోలవరం 124, టి.నర్సాపురం 104, ఉంగుటూరు 189, వేలేరుపాడు మండలంలో 71 మందికి కొత్తగా స్పౌజ్ కేటగిరిలో పెన్షన్లు అందిస్తారన్నారు.

# నాణ్యతకు బిఐఎస్ నిదర్శనం

### పారిశ్రామికాభివృద్ధికి నూరుశాతం ప్రోత్సాహం

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**ప్రజాశక్తి - ఏలూరు**

ఉత్పత్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల వినియోగదారుల సంతృప్తి, బ్రాండ్ విధేయతను పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ, ఎఫ్ఎస్ఎంఇతో కలిసి భారతీయ నాణ్యతా ప్రమాణాలపై (బిఐఎస్) నిర్వహించిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఇ స్కీమ్‌లపై, ఇండస్ట్రియల్ వ్యూ పేరిట ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశ అనంతరం ఎంఎస్ఎంఇ పారిశ్రామికవేత్తలకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాణాలను అమలు చేయడం అనేది నాణ్యతా, భద్రత, వినియోగదారుల నమ్మకం కోణంలో అత్యంత అవసరమన్నారు. బిఐఎస్ అనుసరించడం మూలంగా నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి సహకారం, వినియోదారుల నమ్మకాన్ని పొందడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. బిఐఎస్‌పై మరింత అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ, మండలస్థాయిలో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయదలిస్తే అందుకు సహకరిస్తామన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం నూరుశాతం ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్త ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎటువంటి సహకారంనైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజధాని అమరావతికి అతిచేరువలో ఉన్న ఏలూరు జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలోనే మూడో స్థానంలోకి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా కృషి జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభించుకోగా నూజివీడులో పార్క్ ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. జంగారెడ్డిగూడెం సమీపంలోని తాడువాయిలో కూడా 20 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 20 నుంచి 30 ఎకరాలు ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రతి 15 రోజులకోసారి డిఐపిఇసి ద్వారా సింగిల్ విండోలో అనుమతులు ఇస్తామన్నారు. జిల్లాలో వంద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా 60 యూనిట్లను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో కనీసం మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి రానున్న ఆరు నెలల్లో ప్రారంభించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఢిల్లీ నుండి వర్చువల్‌గా మాట్లాడుతూ ఔత్సాహిక, యువ పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తే ప్రోత్సాహక రాయితీలు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎఫ్ఎస్ ఎంఇ జాతీయ అధ్యక్షులు ఎపికె.రెడ్డి మాట్లాడుతూ వస్తువుల కొనుగోలు విషయంలో బిఐఎస్ నాణ్యతకు నిదర్శనమన్నారు. బిఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సజనీ పట్నాల మాట్లాడుతూ పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాల అమలు, ఐఎస్ఐ మార్కు ప్రాముఖ్యత, బిఐఎస్ సర్టిఫికేషన్ ప్రాసెస్ గురించి వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల ఉత్పత్తి పెరుగుతుందని, ఇది దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. వ్యర్థాలు, కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణకు సాధ్యపడుతుందన్నారు. బిఐఎస్ శాస్త్రవేత్త డి.వివేక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల్లో బిఐఎస్ నాణ్యతా ప్రమాణాలు ఎందుకు ముఖ్యమైనవి, ఏవిధంగా పాటించాలో వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎంఇ కన్వీనర్ ఎం.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల అధికారి పి.సుబ్రహమణ్యేశ్వరరావు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, ఉపకార్మిక కమిషనర్ పి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణామండలి ఇఇ వెంకటేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.జితేంద్ర, పలువురు పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కార్పెట్ రంగానికి పూర్వవైభవం**

బిఐఎస్ నాణ్యతా ప్రమాణాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో భాగంగా ఏలూరు కార్పెట్, వివిధ బ్యాంక్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత స్టాల్స్‌ను సందర్శించారు. ఏలూరు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కార్పెట్ రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. దీనికి సంబంధించి కార్పెట్ క్లస్టర్ ఏర్పాటు చేసే పనులను వేగవంతం చేశామన్నారు. కార్పెట్ క్లస్టర్‌కు సంబంధించిన డిపిఆర్‌ను పూర్తిచేసి రాష్ట్ర, కేంద్రస్థాయి కమిటీలకు సమర్పించే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

# ప్రజలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

### సంతకాల సేకరణలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

### 5న చలో విద్యుత్ భవన్ ధర్నా జయప్రదానికి పిలుపు

ఏలూరులో..

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్మార్ట్ మీటర్లు వద్దని, వాటి వల్ల నష్టాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఆర్ఆర్.పేట మెయిన్ రోడ్డు మీదుగా ప్రజల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, రైతు సంఘం కార్యదర్శి డేగ ప్రభాకర్, ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం వేసిందన్నారు. కరెంటు బాదుడు ఉండదని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిందని, ఉన్న ఛార్జీలను తగ్గిస్తామని, ఎన్నికల ప్రణాళికలో ప్రజలకు హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకంటే ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఆగస్టు నెలలో జరిగే ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో చలో విద్యుత్ భవన్ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పంపన రవి, ఎఐటియుసి జిల్లా నాయకులు ఉప్పులూరి హేమ శంకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, వివిధ సంఘాల నాయకులు యర్రా శ్రీనివాసరావు, జి.శివకుమార్, లెనిన్, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి :** మండల కేంద్రంలో బుధవారం వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ఈబిచర్ల భూషణం, కారం ధారయ్య, తగరం బాబూరావు, తెల్లం దుర్గారావు, సిరిబత్తుల సీతారామయ్య, కటం నాగేశ్వరరావు ప్రజా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని విధానం మార్పు అని, విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణకు కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్ర అని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ల ముందు తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరంకి దుర్గారావు, చిట్టిబొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో...

**ద్వారకాతిరుమల :** స్మార్ట్ మీటర్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. ద్వారకా తిరుమలలో వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వర్తక, వాణిజ్య, ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. 5వ తేదీ విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, బికెఎంయు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాల యేసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మాంద్రు బాలరాజు, బికెఎంయు జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి రమేష్, ఎఐటియుసి నాయకులు వై.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కొప్పుల రామకృష్ణ, ఏపూరి వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యడ్లపల్లి సుబ్బారావు, బసవ పూర్ణ చంద్రప్రసాద్, గుదే ఆశీర్వాదం, పాల్గొన్నారు.

వేలేరుపాడులో...

**వేలేరుపాడు రూరల్ :** స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలో ధర్నా నిర్వహించారు. వామపక్ష కార్యాలయాల నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, మడకం ఏసు, కొత్త వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు పిట్టా ప్రసాద్, కంగాల గంగరాజు, బంధం నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా నాయకులు కట్ట ముత్యాలరావు, రవికుమార్, కంటిపల్లి నాగేంద్ర, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.ఇబ్రహీం, వెంకటస్వామి, జాన్‌బాబు, సోడే కన్నారావు పాల్గొన్నారు.

**కలిదిండి :** స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ విద్యుత్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజాసంఘాల నాయకులు వీరవల్లి భాస్కరరావు, చిన్నం శ్రీకాంత్, పరసా రాజేష్, అద్దాని వెంకటేశ్వరరావు, గద్దె అనిల్ కుమార్, బుస్సా రామనాగేంద్రరావు, అబ్దుల్ అక్బర్, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

# గోదావరి వరద తగ్గుముఖం


పోలవరం వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

**ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్**

గత ఆరు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. మంగళవారం భద్రాచలంలో 36.20 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం బుధవారం 32 అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టింది. గోదావరి తగ్గుతుండడంతో ముంపు మండలాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వరద తగ్గుముఖం పట్టినా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్ వే ఇంకా ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి వరద పూర్తిగా తగ్గేవరకు వాగు అవతల ఉన్న ప్రజలకు అవస్థలు తీరేలా లేవు.

**వేలేరుపాడు రూరల్ :** భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినా మండలంలోని ఎద్దు వాగు కాజ్ వే వద్ద తగ్గలేదు. దీంతో ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే టేకూరు వద్ద కూడా రెండు చోట్ల బోట్లు మారి ఆటోల మీద ప్రయాణం చేయాల్సి వస్తుంది.

**పోలవరం :** పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి తగ్గింది. గోదావరి ఎగువ నుంచి అదనంగా వస్తున్న 5,60,943 క్యూసెక్కుల గోదావరి జలాలను జలవనరులశాఖ అధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు. స్పిల్ వే ఎగువన 30.500 మీటర్లు, స్పిల్ వే దిగువన 21,550 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.900 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 21.050 మీటర్లు, ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.020 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# 9న ఆదివాసీ హక్కుల దినోత్సవం

అభివాదం చేస్తున్న నాయకులు, గ్రామపెద్దలు

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా నిర్వహించాలని గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివాసీ విద్యాకేంద్రం భవనంలో బుధవారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఆదివాసీ గిరిజన పాస్టర్ అసోసియేషన్, గిరిజన జ్యోతి నాయకులు, సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహించాలని, ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కులు, చట్టాలపై దాడులు పెరిగాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, గిరిజన భూములను, ఖనిజ సంపదను దోచిపెట్టే ప్రయత్నాలు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గిరిజన చట్టాల జోలికొస్తే తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. జిఒ 3కి చట్టబద్ధత చేసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గిరిజన సాగులో ఉన్న పోడు భూములు పట్టాలిచ్చే విధంగా ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన జ్యోతి నాయకులు కోరం సత్యనారాయణ, ఆదివాసీ పాస్టర్ అసోసియేషన్ నాయకులు ఫిలిప్స్, శేఖర్‌బాబు, గిరిజన సంఘం నాయకులు పోలీస్ నాగేశ్వరరావు, భీమరాజు శ్రీదేవి, కొరస జలపాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జియుకెటిలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

యునైటెడ్ వేతో కలిపిన ఒప్పందంలో భాగంగా ఆర్‌జియుకెటి నూజివీడులోని కెరీర్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ సెల్ పది రోజులుగా విజయవంతంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ సెషన్లను నిర్వహించింది. చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు అవసరమైన నైపుణ్యాలను అందించడం ఈ సెషన్ల ఉద్దేశం. మొత్తం 300 మంది విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమంలో సక్రియంగా పాల్గొని అంకిత భావంతో శిక్షణ పొందారు. ముఖ్యంగా అప్టిట్యూడ్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ టెక్నిక్స్ వంటి అంశాల్లో నైపుణ్యం పొందారు. శిక్షణా కార్యక్రమం చివరి రోజున ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణ్‌రావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి, ప్లేస్‌మెంట్ సెల్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ రుద్రం చింతా నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వారి ప్రయత్నాలను అభినందించారు. యునైటెడ్ వే నుంచి వచ్చిన శిక్షకులను కూడా వారి విలువైన సేవల గుర్తింపుగా సత్కరించారు.

## పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులతో మమేకమై సమస్యలు ఉంటే ఎస్‌హెచ్ఒ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని కోరుకొల్లు బాలికల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సిసి టివిల పనితీరును పరిశీలించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థి దశలోనే మంచి ఆలోచన, చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మురారి శివనాగమణి అన్నారు. మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ నాగభూషణం మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్న చీడ పురుగులని చెప్పారు. యువతను పెడదోవ పట్టించే విషయంలో ఈ మాదక ద్రవ్యాలు ముందున్నాయనారు. ఎవరూ కూడా వీటి బారిన పడవద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా, మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదభరితంగా మారాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు, స్టాఫ్ సెక్రెటరీ జి.పద్మకిషోర్, ఉపాధ్యాయులు గుడిమెళ్ల రాంబాబు, మాధవి, మురళీకృష్ణ, అబ్రహం, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## 'స్వామిత్వ' అమలుపై శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ ప్రాజెక్టు అనుబంధ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫీల్డ్ సర్వే శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి అనురాధ మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజన్ పంచాయతీ అధికారి సుందరి, ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్, ఆగిరిపల్లి ఎంపిడిఒ భార్గవి, నూజివీడు మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ముదినేపల్లి** :స్వామిత్వ పథకం అమలుపై బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఓపిఆర్‌డి అశోక్ స్వామిత్వ పథకం విధివిధానాలను వివరించారు. ఈ సమావేశంలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం** :ఆగస్టు ఒకటో తేదీ నుంచి జరిగే స్వామిత్వ సర్వే కార్యక్రమానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కెఆర్‌ఎస్.కృష్ణప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ విఎన్‌వి.సుజాత అధ్యక్షతన నిర్వహించిన రెండు శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ హాజరయ్యారు.

## పంచాయతీకి కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



కుర్చీలు అందిస్తున్న దాతలు

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర రజక సంఘం తరపున ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయానికి పది కుర్చీలు బహూకరించారు. సర్పంచి కుంటం స్వర్ణలతకు, కార్యదర్శికి సంఘ సభ్యులు దరూ కలిసి బుధవారం పంచా యతీ కార్యాలయం వద్ద కుర్చీలు అందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రెసిడెంట్ తొంటపాక భగవన్నారాయణ, వైస్ ప్రెసిడెంట్ యండమూరి శ్రీనుబాబు, కోశాధికారి గరిసేపల్లి రాజేష్, సంఘ సభ్యులు యండమూరి శ్రీనివాస్, తొంటపాక వెంకటేశ్వరరావు, భీమవరపు అంజిబాబు, బసవరాజు నాగరాజు, రేవూరి స్వామి, యండమూరి సత్యనారాయణ, పెనుమూడి తులసి, చెన్నూరు శ్రీనివాస్, చెన్నూరు రామకృష్ణ, గరిసేపల్లి అవినాష్, యండమూరి విజయ్, గాడిచర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

## రూ.కోటితో రోడ్డు నిర్మాణం

**దెందులూరు**:మండలంలోని వేగవరంలో ఉన్న 150 మంది పేద ప్రజల నివసించే ఇళ్లకు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నామని, అందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూమిని కేటాయిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకున్న సిస్టర్స్ ఆఫ్ గుడ్ న్యూస్ సంస్థ ప్రతినిధులు అభినందనీయులని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. దాదాపు కోటి రూపాయలతో అతి త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి కూడా సొంత ఇంటి కల సాకారం అయ్యేందుకు తాను అన్ని విధాలా అండగా నిలుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దెందులూరు తహశీల్దార్ సుమతి, ఆర్‌సిఎం సంస్థల వికార్ జనరల్ ఫాదర్ బాల, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథ మాస్ లైన్ పార్టీ జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుక్కునూరు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ లచ్చిగూడెం గ్రామస్తులను వరదల కారణంగా నెమలిపేటలోని ఆర్‌అండ్ఆర్ పునరావాస కాలనీకి తరలిస్తున్న ప్పటికీ, అక్కడ సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. తాగునీరు, విద్యుత్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వైద్య కేంద్రం, కమ్యూనిటీ హాల్, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పునరావాస కాలనీని త్వరగా పూర్తి చేసి, ఇళ్లకు సీరియల్ నెంబర్లు, పట్టాలు కేటాయించాలని, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. డివిజన్ కార్యదర్శి సోయం చంద్రావు, కమిటీ సభ్యులు మచ్చ ప్రశాంత్, పెంకి వీరబాబు, సున్నం రాణి, మచ్చ లక్ష్మయ్య, పోడియం లక్ష్మణ రావు, సున్నం రాజు, మడివి ఓశయ్య, మడకం శంకర్, సున్నం శివ, మడివి లక్ష్మయ్య పాల్గొన్నారు.

## కిల్కారి ద్వారా గర్భిణులకు, బాలింతలకు సేవలు

**ఉంగుటూరు** :కిల్కారి, మొబైల్ అకాడమీ కార్యకలాపాలను అమలు చేయడం వల్ల గర్భిణుల, బాలింతల మాతా శిశు ఆరోగ్యానికి దోహదపడుతుందని ప్రోగ్రామిక్ ఆఫీసర్ రాజు అన్నారు. కాగుపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో బుధవారం ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. గర్భిణులకు నాలుగో నెల రాగాలనే వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో ఎఎన్ఎంలు నమోదు చేయాలన్నారు. ఆ డేటా ఆధారంగా కిల్కారి, మొబైల్ అకాడమీ ఆధ్వర్యంలో ఐవిఆర్ఎస్ సాయంతో తల్లీ, బిడ్డల ఆరోగ్యంపై సలహాలు, సూచనలు అందిస్తారని చెప్పారు. ఏదైనా వైద్య సలహాల కోసం 14423 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలన్నారు. ఆసుపత్రి వైద్యురాలు పి.మానస, ఇ.అనూష, ఎంపిహెచ్ఇఒ కె.శ్రీనివాస రావు, పిహెచ్ఎన్ కె.నాగమణి, ఎంపిహెచ్ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ

**నూజివీడు టౌన్** :మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ తెలిపారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. వాటర్ ట్యాంకులను తరచూ పరిశుభ్రం చేయాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు సకాలంలో తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

### నేరాలు - ఘోరాలు

## బాలికతో అసభ్య ప్రవర్తన : ఇద్దరికి జైలు, జరిమానా

**ఏలూరు స్పోర్ట్స్** :బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో ఇద్దరు నిందితులకు ఒక ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.మూడు వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏలూరు రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఎన్ఆర్.పేటకు చెందిన కాళిదాస్ సాయికుమార్, పత్తేబాదకు చెందిన తల్లూరు దాసులపై 2019లో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదైంది. ఈ కేసులో బుధవారం వాదోపవాదనల అనంతరం ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.మూడు వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

## టీచర్ల సమస్యలపై 2న ధర్నా : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు రెండో తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. పవర్ పేటలోని మున్సిపల్ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇంకా పదవీకాలం పూర్తికాని (ఎస్‌జిఎఫ్) స్కూల్ గేమ్స్ సెక్రటరీలను యథావిధిగా కొనసాగించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు తదితర సమస్యల పరిష్కారం కోసం 2న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ, కో ఛైర్మన్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కె.రవికుమార్, ఆర్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 కోట్లతో రోడ్డు అభివృద్ధి

ప్రజాశక్తి - చింతలపూడి

తువ్వచులక, రాయుడుపాలెం, కొనిజర్ల రోడ్డును రూ.నాలుగు కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. లింగపాలెం నుంచి టిసిహెచ్‌ఆర్.పాలెం మీదుగా కొనిజర్ల, ధర్మాజీగూడెం వెళ్లే పంచాయతీరాజ్ రహదారిని అభివృద్ధి చేయాల్సిందిగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌తో మాట్లాడి రూ.నాలుగు కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, మరో వారం రోజుల్లో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

## ఆర్‌జియుకెటిలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి పరిధిలోని ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంగణాల్లో మిగిలిన సీట్లకు జరుగుతున్న కౌన్సెలింగ్ బుధవారం కొనసాగింది. ఈ కౌన్సెలింగ్ నిమిత్తం 597 మందికి కాల్ లెటర్స్ పంపించగా 240 మంది హాజరయ్యారు. ఎస్ఎసి ఆడిటోరియంలో శ్రీకాకుళం, ఒంగోలు విద్యార్థులను ఉద్దేశించి శ్రీకాకుళం డైరెక్టర్ బాలాజీ మాట్లాడుతూ శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులకు తరగతులు నూజివీడు క్యాంపస్‌లోనే జరుగుతాయని, కొంతకాలం తర్వాత పూర్తిస్థాయిలో సౌకర్యాలు సమకూర్చి ఏ క్యాంపస్ వాళ్లకు ఆ క్యాంపస్‌లోనే తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న వారికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వాలంటీర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థులకు తగిన సహకారాన్ని అందించారు.

## జీలుగుమిల్లి ఎస్ఐగా క్రాంతికుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వాసం క్రాంతికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా జీలుగుమిల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ స్టేషన్ లో పని చేసిన అనుభవం ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. అనంతరం సిఐ వెంకటేశ్వరావును మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కుక్కునూరు ఎస్ఐగా రాజారెడ్డి

**కుక్కునూరు** :కుక్కునూరు ఎస్ఐగా రాజారెడ్డి నియమితులయ్యారు. డిసిఆర్‌బిలో పనిచేస్తున్న రాజారెడ్డికి తాజాగా కుక్కునూరులో పోస్టింగ్ లభించింది. ఇదే స్టేషన్‌లో ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను క్రమశిక్షణ చర్యల కింద డిసిఆర్‌బికి అటాచ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## రీ సర్వే భూములు పరిశీలిస్తాం

ప్రజాశక్తి - ముసునూరు

గోపవరం రెవెన్యూ పరిధిలో రీ సర్వే భూములను మరొకసారి పరిశీలించనున్నట్లు తహశీల్దార్ డి.ప్రశాంతి అన్నారు. మండలంలోని గోపవరం పంచాయతీ కార్యాలయంలో రైతులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో 166 ఎల్‌పిఎం జాయింట్స్ కలిగి ఉన్నాయి. ఎల్‌పిఎం జాయింట్స్ వల్ల సమస్య ఉన్నవారు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌కు అర్జీలు అందించారు. వాటిని పరిశీలిస్తామని తహశీల్దార్ చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కె.వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

## 'హామీలు అమలు చేయని కూటమి'

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలో వైసిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షులు తాండ్ర రాజేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త రామాలయం నుంచి 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌తో సహా 600కు పైగా హామీలను నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలు గుర్తించాలని, క్యూ ఆర్ కోడ్ ద్వారా మేనిఫెస్టో వివరాలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చెబ్రోలు గీతవాణి, సర్పంచి రావు మీనావినోద్ పాల్గొన్నారు.

## మతం మానవ కల్పితమైన ఒక వ్యవస్థ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మతాలు మానవ కల్పితమైన ఒక వ్యవస్థ అని, మతాలు అనేవి మనుషుల మధ్య చిచ్చు పెట్టేలా ఉండకూడదని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. పోలవరం నియోజకవర్గ స్థాయి పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు ఎంఎల్ఎను బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మత పరమైన విభేదాలు లేకుండా సామరస్యంగా ఉండాలని సూచించారు. క్రైస్తవుల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షులు బి.ఎజ్రాశాస్త్రి, సభ్యులు దేవా సహాయం, దానియేలు, భరత్, స్టీఫెన్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## స్పౌజ్ కేటగిరిలో 189 పెన్షన్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

స్పౌజ్ కేటగిరిలో ఉంగుటూరు మండలానికి 189 పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ వెల్లడించారు. వీటిని ఆగస్టు నెలలో లబ్ధిదారులకు పంపిణీ చేసేలా పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ఇప్పటివరకూ 11,611 ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఉండగా కొత్తగా మంజూరైన వాటితో కలిపి 11,800 మంది లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే సొమ్ములు అందిస్తున్నామని తెలిపారు.

వచ్చే డిసెంబర్ నాటికి

# పోలవరం డయాఫ్రం వాల్ పనులు పూర్తి

### పోలవరం ఎడమ కాల్వ పనుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి 2025 కల్లా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. పోలవరం ప్రాజెక్ట్, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం పాలకొల్లులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతికి సంబంధించి నేషనల్ హైవే క్రాసింగ్ దగ్గర వంతెన పనులు ఆగస్టులోగా పూర్తి చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో పోలవరం ఎడమ కాలువకు ఒక్క రూపాయిగాని, ఒక తట్ట మట్టి పనులుగాని చేయలేదని మంత్రి రామానాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులతోపాటు పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగంగా జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. డయాఫ్రం వాల్ 25,238 చదరపు మీటర్లు పూర్తి చేసి 40 శాతం పురోగతి సాధించామన్నారు. డయాఫ్రం వాల్ 373 ప్యానల్స్‌కుగాను, ఇప్పటికే క్రిటికల్‌గా ఉన్న 130 ప్యానల్స్ పూర్తి చేశామన్నారు. వరదల కాలంలోనూ డయాఫ్రం వాల్ పనులు ఆగకుండా, డీవాటరింగ్ చేసుకుంటూ 2025 డిసెంబర్‌కు పూర్తి చేస్తామన్నారు. గ్యాప్-1 ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్యాప్-2 ఇసిఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్స్ సిడబ్ల్యుసి, పిపిఎ ఆమోదం పొందిన వెంటనే నవంబర్‌కు పనులు మొదలు పెడతామన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల ఎస్ఇలు, ఇఇలు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడేన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

### చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

జంగారెడ్డి గూడెం పట్టణాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవిరత్నం అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్నదే తన ధ్యేయమన్నారు. నియోజవర్గంలో అతిపెద్ద పట్టణం జంగారెడ్డిగూడేన్ని ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. జంగారెడ్డిగూడెంలో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో రహదారులన్నీ వీలైనంత త్వరగా బాగు చేయిస్తామన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య అయినా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ ఏడాది కాలంలో నియోజకవర్గంలో విద్యుత్ శాఖ బాగా పనిచేస్తుందని, ఆ శాఖకు అభినందనలని తెలిపారు. టిడ్కో ఇళ్ల విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే అందిస్తామని చెప్పారు. పట్టణంలో ఇద్దరు బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు ఒకేసారి పరిహారం అందించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

**ఏలూరు అర్బన్** :పోలవరం కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలేనని, తక్షణమే వాటిని రద్దు చేసి నిర్వాసితులందరికీ ఒకేసారి పరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవనంలో రెండు రోజుల పాటు జరిగిన భూమి అధికార్ ఆందోళన జాతీయ సమావేశంలో జిల్లా నుంచి రామకృష్ణ పాల్గొని రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, పేదల సమస్యలపై మాట్లాడారు. ఈ విషయాలను బుధవారం ఆయన పత్రికలకు విడుదల చేశారు. పోలవరం నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి ఇళ్లు ఖాళీ చేయించే నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఒక యూనిట్‌గా గుర్తించి రూ.పది లక్షలు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు అదనంగా పరిహారం ఇవ్వాలని, ఇళ్లు, పశువులు, చెట్లకు సంబంధించి పరిహారం ఇవ్వాలని, రవాణాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గిరిజనులకు భూమికి భూమి అనే విధానాన్ని అమలు చేయాలని, వ్యవసాయానికి అనువైన భూములు ఇవ్వాలని, సురక్షిత ప్రాంతాల్లోనే పునరావాస కాలనీలు నిర్మించాలని, వ్యవసాయానికి అనువైన భూములు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. గోదావరి వరదలను అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జిఒ 3ని అమలు చేయాలని, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు

# మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ అక్రమ రవాణాను సమాజం సమిష్టి కృషితో నిరోధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో సంబంధిత అధికారులు, సామాజిక కార్యకర్తలు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులతో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా ఒక పెను సవాల్‌గా మారిందని, ఇది ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఒక వ్యవస్థీకృత నేరమని, దీనిని సమాజం సమిష్టి కృషితో నిరోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డిసిపిఒలు సూర్య చక్రవేణి, ఆర్.రాజేష్, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ వినోద్, పోలీసులు పాల్గొన్నారు.

**చింతలపూడి** : మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు పిలుపునిచ్చారు. స్థానిక అర్పణ జూనియర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ పిల్లలు బాధ్యతగా చదువుకోవాలన్నారు. చదువుకునే వయసులో ప్రేమ, పెళ్లిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా మోసపోతున్నారన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ టి.క్రాంతికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, అడ్వకేట్ దుర్గాభవాని, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ పి.గుర్వినాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్** : పట్టణంలోని బి ఫార్మసీ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఒ అనూష పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.రమేష్, మాజీ ప్రెసిడెంట్ సత్యప్రకాష్, న్యాయవాదులు ఎస్‌కెడి.ప్రసాద్, గోపీనాథ్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ రవి, ప్రిన్సిపల్, పోలీసులు పాల్గొన్నారు.

# శనివారపుపేట సొసైటీ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

శనివారపుపేట విశాల సహకార పరపతి సంఘం నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఛైర్మన్‌గా కోనేరు వంశీకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సోమిశెట్టి రామ్మోహన్‌రావు, కొనికి మహేష్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, డివిజన్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులపై అవగాహన అవసరం

**ఏలూరు సిటీ** :విద్యార్థులు దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల, వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలను అరికట్టుకోగలుగుతామని, విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏలూరు కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశాంక్ సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేట గాంధీ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులకు బుధవారం జ్వరాలు ఇతర అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. దోమ కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా కలుషితమైన నీరు ఆహారం తినటం, తాగడం వల్ల టైఫాయిడ్, అతిసార, కామెర్లు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రై డే ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్త వెంకటలక్ష్మి, శ్రీలక్ష్మి నీలాదేవి, దుర్గ, ఆశా కార్యకర్తలు అనురాధ, చిట్టెమ్మ, దుర్గ, మణి, ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, ఇందిరా, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌలు కార్డుతో పలు ప్రయోజనాలు

**ముసునూరు** : ప్రతి కౌలు రైతూ కౌలు కార్డు తీసుకుంటే ప్రభుత్వ పథకాలు, లబ్ధి చేకూరుతాయని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా అన్నారు. మండలంలోని కాట్రేనిపాడులో డివిజన్ వ్యవసాయ అధికారి విద్యాసాగర్, ఎఒ ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో రైతులకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హబీబ్‌భాషా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, KURAPATI DHARMASWAMY (Old name) Son of KURAPATI SHOBANADRA RAO , R/o Door.No. 2-41/1, Opposite Vetarnity Hospital, Pedavegi, West Godavari District, PIN-534475, have changed my name KURAPATI DHARMA SWAMY to KURAPATI DHARMA SOMA- LINGESWARA RAO (new name) same as intimated to The General Public

**పాస్‌పోర్టు పోయింది**

పట్టా పుష్పలత, భర్త, పట్టా ప్రసాద్, డోర్ నెంబర్ 45a -5-7a, రాజీవ్ నగర్, పాలకొల్లు రూరల్ పంచాయతీ, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 20-11-2008లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి H1760526 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. నేను ది 20-6-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు యడ్లబజార్ సెంటర్ లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 8885262950

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై స్థానికుల అభ్యంతరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం పశువైద్యశాల ఎదుట నాలుగు రోడ్ల జంక్షన్ మధ్యగా ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం తొలగించి ప్రభుత్వ స్థలంలో కొత్తగా ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వంటివి జరిగితే పాఠశాల విద్యార్థులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదని, ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లేలా ఉందని అంటున్నారు. దీనిపై ఎలక్ట్రికల్ ఎఇని వివరణ కోరగా పంచాయతీ నుంచి నోటీసులు అందాయని, అక్కడ గతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ కుంగిందని, మళ్లీ ఏర్పాటు చేస్తున్నామని, అభ్యంతరాలు ఉంటే తెలపొచ్చని చెప్పారు.

**IN THE COURT OF THE M.A.C.T-CUM- 1st ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT: AT SECUNDERABAD**
**O.P.No. 371 of 2024**

Between :
Bojula Nagamani & others ...Petitioners
And
Peruri Manikanta & another ...Respondents

To,
1. Peruri Manikanta, S/o P Surya Prakash, Aged about: major,
Occ: Owner-cum-Rider of motor cycle Br.No TS-07-JT-3963,
R/o.H..No. 25-19-1/4, 26th division ,
Mallimoggala Vari Veedi,
Narsimharaopeta, Eluru, West Godavari dist, Andra Pradesh-534006.

**NOTICE**

Please take notice that in the above matter the Petitioner had filed case against you ( Respondent No.1) for compensation, and the same is posted for your appearance on 22-08-2025.
You are advised to appear on 22-08-2025 at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided ex party.

**(BY THE ORDER OF THE COURT)**

E.BALA KRISHNA,
V. SHANTHI
M.SATHISH KUMAR
K.PRASHANTH
Advocates
# H. No.5-12-186-/8,
Mangapuram,
H.B.Colony,
Moula Ali,
Hyderabad – 40
Counsel for Petitioner

**ప్రకటన**
**మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**I.P.No.10/2025**

Between:
1.Smt.Narava Bhavani, W/o.Narava Naresh, House No.G-1, Flat No.C-70, L&T Housing Colony, Penkullapadu, Palakollu-534260, W.G.Dt., A.P.
2.Narava Naresh, S/o.Narava Suryanarayana, House No.G-1, Flat No.C-70, L&T Housing Colony, Penkullapadu, Palakollu-534260, W.G.Dt., A.P. ...Petitioners
Vs
1.Vemana Raja Babu, S/o.Not Known, 2nd Floor, Vamsiram Jyothi CELESTA, Plot No.66, Kavuri Hills, Jubilee Hills, Hyderabad-500033, Telangana.
2.Pulakhadam Madhava Ramesh, S/o.Not Known, C/o.Mitra Aqua Feeds and Needs, Near DTDC Courier, Besides Town Railway Station, Bhimavaram- 534201.
3.Sypu Subbayamma, W/o.Not Known, Near Sairam Theatre, Turputallu Centre, Turputallu-534280, W.G.Dt.
4.Pulaparthi Subba Rao, S/o.Not Known, Pulavarthivaripalem, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt., A.P.
5.Ungarala Bhaskara Rao, S/o.Not Known, C/o.Sri Laxmi Prabha Aqua Feeds, Vemuladeevi-534275, Mogalturu Mandal, W.G.Dt., A.P.
6.Kuralla Narasimha Rao (Chanti), S/o.Not Known, Near Lakshmi Vilas Bank, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt., A.P.
7.Sattineni Varalakshmi, W/o.Rama krishna, Mollaparru Beach Road, Perupalem, Mogalthuru Mandal, W.G.Dt.
8.Melam Aswapathi, S/o.Not Known Melamvari Meraka, Perupalem-534281, Mogalturu Mandal, W.G.Dt., A.P.
9.Andey Narayana Rao, S/o.Not Known, C/o.Mangatayaru Aqua Feeds, Mollaparru Centre, Mollaparru, Perupalem-534281, Mogalturu Mandal, W.G.Dt., A.P.
10.Sunkara Ramesh, S/o.Not Known, C/o.Sri Vijaya Durga Feeds, Near High School Centre, Perupalem, Mogalturu Mandal, W.G.Dt.
11.Cherukuwada Ravikanth, S/o.Venkata Narasimha Rao, D.No.27A-2-4, Krishna Nagar, Palakollu-534260, W.G.Dt.,A.P.
12.Melam Srinivas, S/o.Not Known, Mollaparru Centre, Perupalem-534281, Mogaluru Mandal, W.G.Dt.
13.Smt.Adabala Ravallika, W/o.Venkanna, Near High School, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt.
14.I.V.Ramalinga Raju, S/o.Not Known Prop:Redux Aqua Lab.Pippara, Ganapavaram Mandal, W.G.Dt.
15.The Official Receiver, W.G.Dt., District Court Complex, Eluru.

పై నంబరు పిటిషన్లో పిటిషనర్ Insolvent గా డిక్లేర్ చేసి రుణ విముక్తులను చేయగలందులకు పై నంబరు పిటిషన్ దాఖలు చేసినందున పైకోర్టు వారి ఎదుట **ది.06-08-2025 తేదీన ఉ.10.30లకు** వాయిదా అయి ఉన్నది. ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యడల కోర్టు వారి ఎదుట హాజరై తెలుపు కొనవలెను. మీరు స్వయంగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటిషన్ తీర్మానము చేయబడును అని ఇందు మూలముగా తెలియచెయ్యడము అయినది.

(కోర్టు ఆర్డర్ ప్రకారం)

**చెల్లెం యేసురత్నం**
నర్సాపురం అడ్వకేటు, పాలకొల్లు
తేది.30-07-2025 సెల్: 9640639144